# పురుష హృదయం

శ్రీ జయంతి
శ్రీ రామమూర్తి

"నీ వుత్తరం చేరింది. మీరు డేరాడూన్ వస్తున్నారని తెలిసి నేనూ, మా వారూ బ్రహ్మానందపడ్డాం. ఉద్యోగపు ఇబ్బందిగాని, ఢిల్లీకి డూను ఎంతదూరం? ఆరునెలలకొకసారా మనం కలుసుకోడం? పోనీలే, ఇప్పటికయినా అదృష్టవంతులం. డ్యూటీ పేరుమీదైనా మీ రిక్కడికి వస్తున్నారు.

మీ రాక గురించి విన్నప్పటినుంచీ 'ఎప్పుడు కలుసుకుంటామా' అని ఒకే తహతహ బయలుదేరింది నా మనస్సులో. అన్నం రుచించదు. కంటికి కునుకురాదు. ఇంకెంత? వారంరోజులు కళ్లు మూసుకుంటే ఇట్టే తిరిగి వస్తాయి. అయితే ఒక్క మాట! నువ్వు తప్పు పట్టుకోనంటే రాస్తాను లతా! ఈ మధ్య మావారికి వొంట్లో బొత్తిగా బాగుండడము లేదు. లోపలిజ్వరంతో చిక్కి శల్యమై పోయేరు. ఎన్ని మందులు వాడినా గుణం వెంట్రుకవాసికూడా లేదు. మా ఆదాయంలో సగం వారి మందులకే అయిపోతూంది. అస్తమానం వారిదగ్గరే కూర్చోవాలి నేను. గంటగంటకీ మోతాదు లందించాలి. యీ కారణాలవల్ల మీ బస శేషాచలంగారి యింటిలో ఏర్పాటు చేస్తున్నాం. వాళ్లకి మాలాంటి బెంగలేమీ లేవు. పుష్టీ, తుష్టీ, పెద్దయిల్లూ, పనిమనిషీ - అన్ని హంగులూ వున్నాయి. అక్కడదిగినా మీకు మాయింటవున్నట్లే. అన్నియేర్పాట్లూ మేమే చెప్పి చేయిస్తాం.

నీ ప్రాణప్రియ
"తార"

తా॥ క॥ మీరువచ్చేటప్పుడు స్టెయిన్‌లెస్ స్టీలుది పులుసు బొప్పెళం ఒకటి తేవలెను. అది యిక్కడ దొరకదు కాబట్టి మరచిపోవద్దు."

వుత్తరం మడిచి తిరిగి భార్య కందించేడు రామారావు.

"ఏమంటారు?" అంది లత.

"ఏముంది - సరే. శేషాచలమూ నామిత్రుడేగా. వాళ్లింట్లోనే దిగుదాం" అన్నాడు రామారావు.

"దిగవచ్చుననుకోండి, కాని తారదగ్గర వున్న చనువు నాకు కమలదగ్గరవుండదా మరి? ఆమె అదోరకం మనిషి." అని నసిగింది. రామారావు దీర్ఘంగా నిట్టూర్చేడు. ఆ నిట్టూర్పులో అర్థం "ముఖప్రీతి కబుర్లు చెప్పే కంటే ముభావంగా వుండడమే నయం" అని.

రామారావు తిన్నగా ప్రక్కగదిలోకి వెళ్ళి, పేపరులో తలదూర్చేడు. విశ్వాసరావు కిచ్చిన వంద రూపాయలూ అతనికి జ్ఞాపకం వస్తున్నాయి. నిజానికి రామారావు విశ్వాసరావుని పూర్తిగా ఎరుగును. అతనికి మనసులోని మార్దవం కన్న పెదిమెలమీది తీపి ఎక్కువ. అంతకన్న రెండాకు లెక్కువ చదివింది అతని గృహిణి తార. కాని, తనభార్య లత అమాయకురాలు. ఎంత తేటతెల్లంగా చెప్పినా ఆమె గ్రహించలేదు. అందువల్లనే అడిగిన తక్షణం పెట్టితీసి ఋణం వున్నట్లు —ఒకటికాదు, రెండుకాదు, వందరూపాయలు యిచ్చింది ఆ రూపాయలు చేజారి ఆరు నెల్లయిందే గానీ అవి తిరిగి ఎప్పుడొస్తాయో ఆ బ్రహ్మదేవుడు కూడా చెప్పలేడు! పోనీ, సంయోగవశాన ఏదో 'టూరు' తగిలింది—నాలుగురోజులు వాళ్లింటో బస చేస్తే — కాస్త బాకీ సరిపోయిందని సంతృప్తి పడవచ్చుననుకుంటే, దానికి ఎదురుబందం ఈ వుత్తరం ఒకటి. రామారావు ఒక్కసారి చిటికవేసి ఆవులించేడు. అతనికి శేషాచలమూ, అతనిభార్య కమలా జ్ఞాపకం వస్తున్నారు. వాళ్ళది ఎంత పొదుపు, ఎంత మర్యాద, ఎంత ఆత్మవిశ్వాసం! వాళ్ళని తలుచుకున్నంత మాత్రాన్నే మనస్సులో సదుద్దేశాలు ప్రవేశిస్తాయి. వాళ్ళ వాక్కుల్లో ముఖప్రీతికి తావులేదు. వాళ్ల మర్యాదలో ప్రతిఫలానికి స్థానం లేదు!!

రైలు డేరాడూన్ స్టేషను సమీపిస్తుండగానే పరుపు చుట్టేసి లత బయటికి తొంగి చూసింది. తారా, ఆమె భర్తా ప్లాటుఫారంమీద నిలచివున్నారు. దూరప్రయాణం చేసివచ్చిన వృద్ధ యాత్రికునిలా రైలు ఉస్సురంటూ ఆగిపోయింది. తార ఒక్కపరుగున సమీపించి, లతని కౌగలించుకుని, "ఎంతగా చిక్కిపోయావు- బొత్తిగా ఆనవాలు కట్టలేకుండా మారిపోయావు" అంది ఆప్యాయంగా. తార చూపిన ప్రేమకి లత కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగేయి. విశ్వాసరావు టాక్సీ పిలిచి, సామాను వెనక కట్టించేడు. నలుగురూ లోపల ఎక్కి కూర్చున్నారు. టాక్సీ కారు తారు రోడ్డుమీద చల్లగా జారుతూ పోతూంది. శీతాకాలపు చలిగాలి మొహాన కొట్టి హాయినిస్తోంది.

"శేషాచలం వూళ్ళో ఉన్నాడా?" అన్నాడు రామారావు. "వున్నాడు. శలవైనా ఈ వేళకూడా ఆఫీసుకి వెళ్ళేడు. మామూలేగా" అన్నాడు విశ్వాసరావు.

రామారావు తిరిగి ప్రశ్నించలేదు. టాక్సీ వచ్చి లిట్టనురోడ్డు మలుపులో ఆగింది. లోపలనుండి కమలవచ్చి స్వాగతం చెప్పింది. ఆరోజు తారా దంపతులు కూడా అక్కడే భోజనం.

డ్యూటీలోవున్న రెండురోజులూ రామారావు వూపిరి సలుపనంత పనిలో నిమగ్నుడయ్యేడు. పిమ్మట రెండురోజులు సెలవు తీసుకుని డేరాడూన్ చుట్టుప్రక్కల చూడవలసినవన్నీ చూసివచ్చేడు భార్యతో సహా. సహస్రధారవెళ్ళి స్నానంచేసి వచ్చేడు. ముసూరీవెళ్ళి వినోదించేడు. హరిద్వారం, హృషీకేశం వెళ్ళి యాత్రికుల లిస్టులో పేరు వేయించుకున్నాడు. టపకేశ్వరం, తపోవనం రాబర్సు గుహలు టాక్సీమీద తిరిగివచ్చేడు. ఈ యాత్రాస్థలాలన్నిటికీ తారా-ఆమెభర్తా కూడా కలిసివెళ్ళేరు. శేషాచలం, కమలా మాత్రం వెళ్ళలేదు. ఇంటికి వచ్చిన అతిథుల మర్యాదలో ఇసుమంతైనా అప్రమత్తత వహించలేదు. పంచభక్ష్య పరమాన్నాలు సమకూర్చలేదుగాని, యథాశక్తి అన్నపానాలు అమరించేరు. అయినా, లత మనస్సులో ఎందుకో అసంతృప్తి చెలరేగింది.

"కమలకి డబ్బే ప్రధానం-ఆమెకేసరదాలేదు. మాతోవస్తే ఆమె దర్జాకి లోటువచ్చింది కాబోలు!!" అని సాగతీసింది. తార ఆ భావాగ్నికి ఆజ్యంపోసింది-" చెప్పుకుంటే సిగ్గు! ఓ వూళ్లో వున్నామన్నమాటే గాని, ఏ సాయమూ ఆశించడానికి లేదు. నీకళ్లతో నీవు చూసేవు గనక సరిపోయింది. ఆ మాటే నేనంటేనా?"-అని బుగ్గలు నొక్కుకుంది.

మరునాడు ఢిల్లీ తిరిగి వెళ్ళిపోడానికి ఉద

య మే భార్య సామాను సర్దుతూండగా, "ఇప్పుడే వస్తావని" రామారావు ఒక్కడూ వీధిలోకి బయలుదేరేడు. అతడు తిన్నగా విశ్వాసరావింటికి వెళ్ళేడు. అతడు ఆ వేళ శెలవు గనక ఎండలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. మిత్రుని చూచిన వెంటనే లోనికివెళ్ళి కుర్చీ తెచ్చి వేసేడు.

"తార ఇప్పుడే తనస్నేహితులతో కలిసి ఉదయపు సినిమాకి వెళ్ళింది—లే, అలా బజారుకివెళ్ళి కాఫీ త్రాగుదాం" అంటూ విశ్వాసరావు బట్టలూ, జోళ్ళూ వేసుకు వచ్చేడు. దారిలో అతడు "నన్ను క్షమించాలి రామం. నీ వంద రూపాయలూ ఇంకా తిరిగి ఇవ్వలేకపోయేను. ఇంకో నెల్లాళ్లో మనియార్డరు చేస్తాను" అన్నాడు రామారావు ముఖావంగా.

"దానికేంలే. ఆరు నెలలైనా ఆ రూపాయలు నీకింకా జ్ఞాపకం వున్నాయి—అంతే చాలు"—

"ఎంత మాట, పరులసొమ్ము పదిరెట్లుగా చూసుకోవాలి. నా అవసరానికి తెచ్చుకున్నది, నీ అవసరానికి ఇవ్వవద్దా? పిడుగుల్లా ఆపదలు ఒకదాని వెంబడి ఒకటివచ్చి పడుతున్నాయిగాని, లేకుంటే ఏనాడో పంపి వుండనా?" అన్నాడు విశ్వాసరావు. రామారావు మళ్ళీ ఆ ప్రస్తావన తేలేదు. ఇద్దరూ 'ఇండియానా'కి వెళ్ళి కాఫీ త్రాగేరు. బిల్లు విశ్వాసరావే చెల్లించేడు. ఇద్దరూ ఫల్టన్ బజారువైపు వదుస్తుండగా రామారావు "నీకు తెలిసిన మంచి బట్టలకొట్టు ఒకటి చూపించు. నా భార్యకి ఈ వూరి చీరలంటే అతిమోజు" అన్నాడు.

విశ్వాసరావు "కపూర్ అండ్ సన్సు"కి వెడదామన్నాడు.

"వాళ్ళు నమమ్మకమైన సరుకు యిస్తారు గదా"

"అదేమిటి? నేను ఏ బట్టలుతీసుకున్నా నెల్లాళ్ళకిగాని వాళ్లకి సొమ్ము యివ్వను. ఈలోగా సరుకు నాసిగా కనబడిందో, ధర విరక్కొట్టేస్తాను" అన్నాడు విశ్వాసరావు.

"అయితే నీకు ఖాతా వేరం వుందన్నమాట కపూర్ దగ్గర"—

"ఔ" నన్నట్లు తల ఆడించేడు విశ్వాసరావు.

ఇంతలో కపూర్ దుకాణం వచ్చింది. కోరడమేతడవుగా చీరలు గుటలు గుట్టలుగా వచ్చిపడ్డవి. రామారావు ఓ పట్టుచీర పసందు చేసి ధరకట్టించేడు. నూటపదిరూపాయలకు వాళ్లు బిల్లురాసి చేతికిచ్చేరు చీరతో సహా. రామారావు ఏదో తెల్లబోయినట్లు కళ్ళుపెట్టి అటూ యిటూ చూసేడు. కోటు జేబులూ, పంట్లాం జేబులూ తడుముకున్నాడు.

"అయ్యో పర్సు తేవడం మరచిపోయేను" అన్నాడు.

షాపువాడు "పోనీ, సొమ్ముకేంలెండి. ఈ బాబు మాకు తెలుసు-ఈయన ఖాతాలో రాసేస్తాం" అన్నాడు. రామం ప్రశ్నార్థకంగా చూసేడు. విశ్వాసరావు విధిలేక తల ఆడించేడు. ఆముదం త్రాగినట్లు మొహంపెట్టి ఖాతాపుస్తకంలో సంతకం చేసేడు.

ఆ రాత్రి రైలుస్టేషనుకి తారా, ఆమె భర్తా రాలేదు. శేషాచలమూ, కమలా వచ్చేరు. రామారావు తమకిచ్చిన ఆతిథ్యానికి ధన్యవాదాలర్పించేడు. వంటలు అద్భుతంగా వున్నాయన్నాడు. రిపబ్లిక్ దినానికి ఢిల్లీరమ్మని మరీమరీకోరేడు. ఈ ప్రశంసలన్నింటి వెనుక 'తందానతానా' అన్నా, లతమనస్సు స్టేషనుకి రాలేదేమని కొట్టుకుంటోంది. ఆఖరి నిముషందాకా ఆమెకన్నులు తారకోరకు ఆ జనసమూహంలో వెదకుతూ నేవున్నాయి.

రైలుకదిలింది. ప్లాటుఫారం దాటగానే రామారావు బెడ్డింగులు విప్పిపరిచేడు. ఆ కంపార్టుమెంటులో వాళ్ళిద్దరే వున్నారు. లత ఉదాసీనంగా బయటికి తొంగిచూస్తూ "తార అల్పసంతోషి. ఆపులుసు బొప్పళానికే బ్రహ్మానందపడింది" అంది. భర్త "ఊఁ" అన్నాడు.

"ఆమెభర్త అంతకన్న ఉత్తముడు. వాళ్ల సరదాలే వేరు. వాళ్లే వేరు. వాళ్ళచేతికి ఎముక లేదు. ఈమాటు వచ్చినప్పుడు తప్పకుండా వాళ్ళింటిలోనే దిగాలి" అంది మళ్ళీ.

"సరే, దానికేం" అన్నాడు రామారావు గంభీరంగా. రైలుస్పీడుఅందుకుంది. ఇద్దరూ ప్రక్కలమీదవ్రాలి ఆవులిస్తున్నారు. అర నిముషంలో లత నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయింది. రామారావుకి నిద్రపట్టడంలేదు. తానెన్ని విషయాలు లతకిచెప్పకుండా దాచగలడు? కున్నపునీళ్ళనే పాలుగానూ, పాలను కున్నపునీళ్లుగానూ భావించే ఆమె అమాయకత అతన్ని కలవరపరచింది. నిద్రించే ప్రయత్నంలో అతడు గట్టిగా కళ్లు మూసుకున్నాడు. రైలు చరచరా దౌడు తీస్తూ యాత్రికులకు మైకం కలిగిస్తూంది. ఆ మైకం పొరలో మూసిన అతని కళ్లలో—కపూర్ అండుసన్సువారి గూర్ఖా వాడు ఖాతా పుస్తకంతో విశ్వాసరావు ఆఫీసు గుమ్మంమీద నిలబడి వున్నాడు.

"నేను మాత్రం ఏంచెయ్యను. ఒకటా, రెండా నూరు రూపాయలు! తన జీతమంతో నాదీ అంతేగదా. ఈ సంగతి లతకి చెప్పివేస్తాను," అనుకుంటూ లేచేడు రామారావు. భార్యమాత్రం నిద్రిస్తూనే వుంది. ఆమె పెదవులమీద చిరునవ్వు తాండవిస్తున్నది. "తన స్నేహితురాలి తేనె మాటలు జ్ఞాపకం వస్తున్నట్లున్నాయి" అనుకుంటూ, మెల్లగా పెట్టెతీసి తాను కొన్న సిలుకుచీర ఆమె తలగడ క్రిందపెట్టి ప్రక్కమీద వ్రాలేడు రామారావు. రైలువేగం ఇంకా హెచ్చింది. ★


కలాపి
టాల్కం పౌడరు

రెండు కొత్త ప్యాకింగులలో దొరుకును.
టిన్ను రు. 2-25
కార్డుబోర్డుబాక్సు రు. 1-50
కలాపి ఇండస్ట్రీస్, బొంబే-2.



విషపు కోతగాయములు!

జామ్-బక్ తో త్వరితంగా మానును
కోతలు, పగుళ్లు, కీటక కాటులను, త్వరితంగా నివారించును . . . కాళ్ల వాపులు, వ్రణములు, కాలిన పుండ్లు, విషగాయములను దూరిగా మాన్పును . . . తెల్ల గజ్జిని నిర్మూలించును. ఏబాధ కైననూ జామ్-బక్ వాడ వచ్చును. ఇది చర్మవాపులకు నానావిధ మూలికా ఔషధము. దీనిలో జంతు క్రొవ్వులు, మూనెలు లేవని గ్యారంటీ చేయబడినది.
ఇది చర్మవ్యాధి నివారణకు చర్మసౌందర్యమునకు ఒక్కటే—జామ్-బక్, జిగటగా లేని ఔషధ క్రీమ్‌ను వాడి చూడండి.
Zam-Buk

జామ్-బక్
మూలికా బామ్
మరియు
ఔషధ క్రీమ్
ఇది మందుల వ్యాపారులందరివద్దను దొరుకును.
సి.ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
బొంబాయి.
FZY-60TEL
సోల్ ఏజెంట్లు: దాదా & కో.
88, నైనప్పనాయక్ వీధి, మద్రాసు-1.